జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 12 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 5

## ప్రజా పోరాటాలే.. ఎర్రజెండా బలం!

- కార్పొరేట్లకు దేశ సంపద.. యువత భవిష్యత్తుతో కేంద్రం చెలగాటం
- ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన: కూనంనేని




**చుంచుపల్లి /సుజాతనగర్, ఆగస్టు 11, ప్రజా జ్యోతి :** సమాజంలో అన్యాయాన్ని ప్రశ్నించి చేసే ప్రజా పోరాటాలే ఎర్రజెండా బలమని, ఇలా పోరాటం చేసే ప్రతి గొంతులో కమ్యూనిజం భావజాలం దాగి ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ నిర్వహిస్తున్న ప్రజాచైతన్య యాత్రలో భాగంగా చుంచుపల్లి, సుజాతనగర్ మండల కేంద్రాల్లో జరిగిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. చుంచుపల్లి మండల కేంద్రంలో సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎండీ రజబ్ అలీ స్థూపానికి

మిగతా 2 లో...

## క్రీడాప్రతిభతో పాటు విద్యలోనూ విద్యార్థులు రాణించేలా తీర్చిదిద్దాలి




- విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించకపోవ డంపై అసంతృప్తి వ్యక్తం చేసిన
- జిల్లా కలెక్టర్ అంకిత్
- కిన్నెరసాని గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాల, యానం బైలు పాఠశాల, పల్లె దవాఖాన, రాజాపురం అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 11 ,(ప్రజా జ్యోతి)** పాల్వంచ మండలం కిన్నెరసాని గ్రామం, యానం బైలు, రాజాపురం ప్రాంతాల్లోని పాఠశాలలు, పల్లె దవాఖాన, అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిన్నెరసాని గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాల, యానం బైలు

మిగతా 2 లో...

- అధికారులేమో రూ.70 లక్షలు.. ప్రజాప్రతినిధు లేమో కోటిన్నర!
- కన్సల్టెన్సీ మాత్రం రూ.2.50 కోట్లు అడుగుతోందన్న సమాచారం
- డీపీఆర్‌కు ముందే అదే సంస్థతో లైన్ ఎస్టిమేషన్.. రూ.7 లక్షలకు ఒప్పందం
- రూ.600 కోట్ల ప్రాజెక్టుపై 1.6 శాతం ఫీజు.. రూ.9.60 కోట్లకు పన్నులు అదనం
- మొత్తంగా డిపిఆర్ కే రూ.11.33 కోట్లు..
- అడ్వాన్స్ ఏ ఖాతా నుంచి చెల్లించా లన్న దానిపై అధికా రుల్లో తర్జనభర్జన
- అన్ని వర్గాల నుంచి అభ్యంతరాలు.. అయినా ముందస్తు చెల్లింపులపై ఎందుకీ తొందర?




4 లో..

## ఇక.. అడ్వాన్స్ భాగోతం..!

కొత్తగూడెం కార్పొరేషన్‌ను మరో భారీ రుణభారంలోకి నెట్టేలా ప్రతిపాదించిన రూ.600 కోట్ల ప్రాజెక్టుపై పట్టణంలో అన్ని వర్గాల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద మొత్తంలో ప్రజాధనం ఖర్చయ్యే అవకాశం ఉందని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, కుల సంఘాలు, సామాన్య ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నా.. కార్పొరేషన్‌లోని కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం కన్సల్టెన్సీ సంస్థకు ముందుగా ఎంత ఇవ్వాలి.. ఏ ఖాతా నుంచి చెల్లించాలి అన్న దానిపైనే దృష్టి పెట్టినట్లు సమాచారం. దీంతో అడ్వాన్స్ పేమెంట్ భాగోతం ఇప్పుడు కొత్త చర్చకు దారితీస్తోంది.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

- ఉదయం 6కే వచ్చిన రోగులు.. 7.30 వరకు వైద్యం కోసం నిరీక్షణ
- రక్తనాళం కనిపించేందుకు గ్లౌజ్‌నే పట్టీగా వాడిన నర్సు!
- ప్రశ్నించిన మీడియా ప్రతినిధిపై డాక్టర్ ఆగ్రహం.. 'కేసుల' హెచ్చరికలు
- వైద్య సేవల తీరుపై విమర్శలు.. డీసీ హెచ్ఎస్ పర్యవేక్షణ ఏది?




3 లో..

## అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో.. వైద్యాధికారుల దాష్టీకం!

## ఆళ్లపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



**ఆళ్ళపల్లి,ఆగస్టు11(ప్రజా జ్యోతి)** ఆళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి (డీఎం హెచ్ఓ) డాక్టర్ తుకారం రాథోడ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడి స్టాఫ్ హాజరు, విధుల వివరాలు, వివిధ రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి పారిశుధ్యంపై ఆరా తీశారు. పీహెచ్‌సీలో మందుల నిల్వలను పరిశీలించడంతో పాటు సీజనల్ వ్యాధుల నియంత్రణకు సంబంధించిన ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్ష నిర్వహించి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రతాప్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోపీలాల్, హెల్త్ ఎడ్యుకేటర్ టీ.రామదేవి, హెచ్ఈఓ రామకృష్ణతో పాటు ఎంఎల్‌హెచ్‌పీలు, జూనియర్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, ఎఫ్ఎన్ఓ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా పోరాటాలే.. ఎర్రజెండా బలం!

(మొదటి పేజీ తరువాయి...)

పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. సమాజ పరిణామాలపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్యపరిచే శక్తి కమ్యూనిస్టు ఉద్యమానికే ఉందన్నారు. కష్టపడి చదివిన యువతకు ఉపాధి కల్పించకుండా వరుస పేపర్ లీకేజీలతో వారి భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతోందని విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థులు, యువత చేపట్టిన ఐక్య ఉద్యమాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగిరావాల్సి వచ్చిందన్నారు. దేశ సంపద కొద్దిమంది బడా కార్పొరేట్ల చేతుల్లో కేంద్రీకృతమవుతోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ కార్మిక హక్కులను బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. పెరుగుతున్న నిత్యావసర ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనం భారంగా మారిందని, పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. బాధితులంతా ఐక్యంగా పోరాడితే ఏ ప్రభుత్వమైనా ప్రజల డిమాండ్లకు స్పందించక తప్పదని అన్నారు. సామాజిక, ఆర్థిక మార్పులకు ఎర్రజెండా మార్గదర్శకమని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల్లో రహదారులు, వంతెనలు, రవాణా సౌకర్యాల మెరుగుదలతో పాటు పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని, రెండు నెలల్లో కొత్తగూడెం కార్పొరేషన్‌తో పాటు నియోజకవర్గంలో మరిన్ని మార్పులు కనిపిస్తాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ నిరంతరం ప్రజల మధ్య ఉంటుందని, ప్రజాచైతన్య యాత్రల ద్వారా ప్రజలను చైతన్యపరిచి భవిష్యత్తులో బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని కూనంనేని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల నాయకులు, ప్రజాచైతన్య యాత్ర బృందం సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డిపిఆర్ టెండర్ రద్దు చేసి చిత్త శుద్ధి నిరూపించుకోవాలి

- 8కోట్ల స్కాంలో సూత్రధారులు ఎవరు!!??
- మున్సిపల్ అధికారులపై పిర్యాదు చేస్తాం
- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్




**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 11 ,(ప్రజా జ్యోతి)** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ లో నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి పారదర్శకత లేకుండా నిర్వహించిన రూ.9 కోట్ల 60 లక్షల డిపిఆర్ టెండర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేసి ఎమ్మెల్యే కూనంనేనీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని జైభీమ్ రావు భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు.మంగళవారం జేబీపీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో యెర్రా కామేష్ మాట్లాడుతూ కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం డిపిఆర్ లో 9 కోట్ల 60 లక్షల విలువచేసే టెండర్ ను కేవలం మూడు రోజులు మాత్రమే సమయం కేటాయించి మూడు రోజుల్లోనే టెండర్ ఓపెన్ చేయడం పూర్తిగా నిబంధనలకు వ్యతిరేకమని కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చినప్పుడు వాటిని రద్దు చేసి మరల టెండర్ నిర్వహించాల్సి ఉండగా కానీ దానికి విరుద్ధంగా మున్సిపల్ అధికారులు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా టెండర్ ఓపెన్ చేశారని,నిబంధనలను తుంగలో త్రొక్కి టెండర్ ఓపెన్ చేసిన అధికారులపై ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.9కోట్ల 60 లక్షల పనికి కనీసం 14 రోజుల గడువు ఇవ్వాలనే ఈ ప్రొక్యూర్మెంట్ నిబంధనలు ఉన్నాయని అన్నారు. టెండర్ ప్రక్రియలో 8 కోట్ల స్కామ్ జరిగే అవకాశం ఉందని అసలు 8కోట్ల స్కాంలో సూత్రధారులు ఎవరని ప్రశ్నించారు??అధికారులు,స్థానిక శాసనసభ్యులు తక్షణమే టెండర్ రద్దు చేయాలని,లేనియెడల కలిసివచ్చే అన్ని రాజకీయ పార్టీలతో కలిసి డిపిఆర్ టెండర్ రద్దు అయ్యేవరకు పోరాడుతామని,అవసరమైతే న్యాయస్థానానికైనా వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంధం మల్లికార్జునరావు,కొత్తగూడెం నియోజకవర్గ అధ్యక్షుడు నాగుల రవికుమార్,పట్టణ అధ్యక్షుడు గజ్జల శంకర్,వినయ్,సోను,మున్నా తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాప్రతిభతో పాటు విద్యలోనూ విద్యార్థులు రాణించేలా తీర్చిదిద్దాలి





(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల, యానం బైలు పల్లె దవాఖాన, రాజాపురం అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులు, చిన్నారులు, గ్రామీణ ప్రజలకు అందుతున్న విద్య, క్రీడా శిక్షణ, వసతి, భోజనం, వైద్య సేవలు, పౌష్టికాహారం, పారిశుద్ధ్యం తదితర సదుపాయాలను పరిశీలించారు. సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో సేవల అమలును స్వయంగా పరిశీలించారు. కిన్నెరసాని గ్రామంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, లైబ్రరీ, క్రీడా ప్రదేశాలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భవనాల పరిస్థితి, ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, అందుతున్న సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడిన కలెక్టర్ వారి విద్యా ప్రగతిపై ఆరా తీశారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, ఇతర విద్యా సామగ్రి అందాయా, తరగతులు సక్రమంగా జరుగుతున్నాయా, ఉపాధ్యాయులు బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల వంటశాలను పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత, తయారీ విధానం, వంటశాల పరిశుభ్రత, మెనూ అమలు తదితర అంశాలను పరిశీలించి విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన, పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. క్రీడా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న క్రీడా శిక్షణపై కూడా జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులు ఏయే క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు, ఆయా క్రీడల్లో వారి ప్రతిభ ఎలా ఉంది, వివిధ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారా, అవసరమైన క్రీడా సామగ్రి అందుబాటులో ఉందా అనే వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి వారికి మెరుగైన శిక్షణ అందించాలని, అవసరమైన క్రీడా సామగ్రిని అందుబాటులో ఉంచాలని సూచించారు. క్రీడా ప్రతిభతో పాటు విద్యలోనూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ అన్నారు. విద్య, క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులు భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా అవసరమైన శిక్షణ, ప్రోత్సాహం అందించాలని అన్నారు. అనంతరం యానం బైలు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం మెనూను పరిశీలించగా, ఆ రోజు మెనూ ప్రకారం ఆహారం అందించకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, రుచికరమైన, పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలును సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పాఠశాల తరగతి గదులు, ఆవరణ, పరిసర ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్ పాఠశాల ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం యానం బైలు పల్లె దవాఖానను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పల్లె దవాఖానలో ప్రజలకు అందుతున్న ప్రాథమిక వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. పల్లె దవాఖానలో నిర్వహిస్తున్న రక్త పరీక్షల నమూనా వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పల్లె దవాఖానలోని ఔషధ నిల్వలను పరిశీలించిన కలెక్టర్ మందుల లభ్యత, నిల్వలు, పంపిణీ వివరాలతో పాటు మందుల గడువు తేదీలను తనిఖీ చేశారు. గడువు ముగిసిన మందులు వినియోగంలోకి రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రోగుల వివరాలు, వైద్య సేవలు, రక్త నమూనా,మందుల నిల్వలు, మందుల పంపిణీ తదితర వివరాలను సంబంధిత రిజిస్టర్లలో ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు సకాలంలో అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పల్లె దవాఖానకు వచ్చే ప్రతి రోగికి అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, వైద్య సేవలతో పాటు ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పల్లె దవాఖాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజలకు అనుకూలమైన వాతావరణంలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం కిన్నెరసాని గ్రామపంచాయతీ పరిధిలోని రాజాపురం అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ తనిఖీ సమయంలో అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులు నిద్రిస్తున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా కేంద్రంలో అందుతున్న సదుపాయాలు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, విద్యా కార్యకలాపాల వివరాలను అంగన్వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల హాజరు, వారికి ప్రతిరోజూ అందిస్తున్న ఆహార మెనూ, పౌష్టికాహార పంపిణీ, గుడ్ల పంపిణీ తదితర వివరాలపై ఆరా తీశారు. అనంతరం చిన్నారులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహారాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఆహార నాణ్యత, తయారీ విధానం, వంటశాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి చిన్నారులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులకు అందిస్తున్న గుడ్లు, ఇతర పౌష్టికాహార పదార్థాల నిల్వలను పరిశీలించి వాటి నిల్వ విధానం, అందుబాటులో ఉన్న పరిమాణం, వినియోగానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అర్హులైన ప్రతి చిన్నారికి సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలోని తరగతి గది, పరిసరాలు, వంట ప్రాంతం, తాగునీటి సదుపాయాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. కేంద్రంలో పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణాన్ని ఎల్లప్పుడూ కొనసాగించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వారి ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పాఠశాలలు, క్రీడా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, పల్లె దవాఖానల్లో ప్రభుత్వం అందిస్తున్న సేవలు క్షేత్రస్థాయిలో ప్రజలకు పూర్తి స్థాయిలో అందేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. విద్యార్థులు, చిన్నారులు, గ్రామీణ ప్రజలకు అందించే భోజనం, పౌష్టికాహారం, విద్య, వైద్య సేవలు, మందులు, వసతి తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు తమ పరిధిలోని సంస్థలను తరచూ సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని, లోపాలు గుర్తించిన వెంటనే వాటిని పరిష్కరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులు, చిన్నారులు, ప్రజల నుంచి వచ్చే సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి ప్రాధాన్యతతో పరిష్కారం చూపాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలలో తహసీల్దార్లు ధారా ప్రసాద్, ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- ఉదయం 6కే వచ్చిన రోగులు.. 7.30 వరకు వైద్యం కోసం నిరీక్షణ
- రక్తనాళం కనిపించేందుకు గ్లౌజ్‌నే పట్టీగా వాడిన నర్సు!
- ప్రశ్నించిన మీడియా ప్రతినిధిపై డాక్టర్ ఆగ్రహం.. 'కేసుల' హెచ్చరికలు
- వైద్య సేవల తీరుపై విమర్శలు.. డీసీహెచ్ఎస్ పర్యవేక్షణ ఏది?




# అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో..
# వైద్యాధికారుల దాష్టీకం!

**అశ్వారావుపేట, ఆగస్టు 11, ప్రజా జ్యోతి :** పేదలు, గిరిజన ప్రజలకు అండగా నిలవాల్సిన అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం ఉదయం 6 గంటలకే ఆసుపత్రికి చేరుకున్న రోగులు 7.30 గంటల వరకు వైద్యులు, నర్సుల కోసం ఎదురుచూడాల్సి వచ్చిందని పలువురు వాపోతున్నారు. మరోవైపు ఓ పేషెంట్‌కు ఇంజక్షన్ ఇచ్చే సమయంలో రక్తనాళం స్పష్టంగా కనిపించేందుకు ఉపయోగించే పట్టీకి బదులుగా గ్లౌజ్‌ను చేతికి కట్టి ఉపయోగించినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపింది. దీనిపై వివరణ కోరిన మీడియా ప్రతినిధిపై డాక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి కేసులు పెడతామని హెచ్చరించినట్లు ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారం పట్టణంలో మరింత చర్చనీయాంశంగా మారింది.



**ఉదయం 6కే వస్తే.. 7.30 దాటినా వైద్యుల జాడేది?**

ఓ మారుమూల గ్రామం నుంచి అత్యవసర వైద్యం కోసం వచ్చిన పేషెంట్ తెల్లవారుజామునే ఆసుపత్రికి చేరుకున్నారు. తీవ్రమైన వేదనతో వైద్యుల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చిందని చెబుతున్నారు. ఇదే క్రమంలో ఉదయం 6 గంటలకే ఆసుపత్రికి చేరుకున్న మరికొందరు రోగులు 7.30 గంటలు దాటినా వైద్య సేవలు అందలేదని వాపోతున్నారు. చాలా సేపు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కోసం నిరీక్షించాల్సి వచ్చిందని చెబుతున్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి సకాలంలో చికిత్స అందకపోతే పరిస్థితి ఎలా ఉంటుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరవుతున్నారా? హాజరు రిజిస్టర్‌లో నమోదైన సమయం, వాస్తవ పరిస్థితులు ఒకేలా ఉన్నాయా? బయోమెట్రిక్ హాజరు సక్రమంగా అమలవుతోందా? రోగులకు అందిస్తున్న చికిత్సల్లో నిర్దేశిత భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. రోగుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**గ్లౌజ్‌నే పట్టీగా వాడారా!?**

ఇక వైద్య సేవలు ఆలస్యమైన తర్వాత ఓ పేషెంట్‌కు ఇంజక్షన్ ఇచ్చే సమయంలో చేతి రక్తనాళం స్పష్టంగా కనిపించేందుకు ఉపయోగించే పట్టీకి బదులుగా మెడికల్ గ్లౌజ్‌ను చేతికి కట్టి ఉపయోగించినట్లు రోగులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వాస్తవాలు అధికారుల విచారణలో తేలాల్సి ఉన్నప్పటికీ, ఇలాంటి పద్ధతి వైద్యపరంగా నిబంధనలకు అనుగుణమేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంజక్షన్ ఇచ్చే సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత, ఇన్ఫెక్షన్ నియంత్రణ ప్రమాణాలపైనా అధికారులు పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. అశ్వారావుపేటతో పాటు చుట్టుపక్కల మారుమూల గ్రామాల ప్రజలకు ఈ ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్య కేంద్రంగా ఉంది. అలాంటి చోట వైద్య సిబ్బంది సమయపాలనతో పాటు రోగులకు అందించే సేవల్లోనూ ఎలాంటి లోపాలకు అవకాశం లేకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది. ప్రస్తుతం వస్తున్న ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. పేదలు, గిరిజనులు ఆధారపడే ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతినకుండా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రశ్నించిన మీడియాపై ఆగ్రహం..**

రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సిబ్బంది ఆలస్యంగా విధులకు రావడం, ఇంజక్షన్ విషయంలో గ్లౌజ్ వినియోగంపై వివరాలు తెలుసుకునేందుకు మీడియా ప్రతినిధి వైద్యాధికారులను సంప్రదించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఓ డాక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, ఆసుపత్రి విధులకు అంతరాయం కలిగిస్తున్నారంటూ కేసులు పెడతామని హెచ్చరించినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై మీడియా వివరణ కోరినప్పుడు వాస్తవాలను వెల్లడించాల్సిన అధికారులు, అందుకు బదులుగా కేసుల హెచ్చరికలకు దిగారన్న ఆరోపణలు రావడం పలు విమర్శలకు దారితీసింది. ఇకనైనా ప్రభుత్వ ఆసుపత్రి తీరుపై వస్తున్న ఆరోపణలకు అధికారులు తెరదించాలి. రికార్డుల ఆధారంగా వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి, లోపాలు ఉంటే సరిదిద్దడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. పేదల వైద్యానికి పెద్ద దిక్కుగా ఉన్న ఈ ఆసుపత్రి సేవలు ప్రైవేట్ ప్రయోజనాలకు కాకుండా ప్రజల ప్రయోజనాలకే అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులదే.

### కన్సల్టెన్సీగా మారిన ప్రభుత్వ ఆసుపత్రి..?

అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రి కొందరి తీరుతో ప్రైవేట్ ఆసుపత్రులకు 'కన్సల్టెన్సీ'గా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాలు లేవంటూ రోగులను బయట ప్రైవేట్ ఆసుపత్రులు, నిర్ధారణ కేంద్రాలకు పంపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి దమ్మపేటలో ప్రైవేట్ ఆసుపత్రి నిర్వహిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను అక్కడికి పంపిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా బయట పరీక్షలు, వైద్య సేవలకు రోగులను మళ్లించడం వెనుక కమీషన్ల వ్యవహారం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత అన్నది తేల్చేందుకు ప్రభుత్వ ఆసుపత్రిలో నమోదైన రోగుల వివరాలు, బయటకు ఇచ్చిన పరీక్షల సూచనలు, ప్రైవేట్ ఆసుపత్రులకు పంపిన రిఫరల్ కేసులు, ముఖ్యంగా గర్భిణుల నమోదు నుంచి ప్రసవం వరకు ఉన్న రికార్డులను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రిలో నమోదైన గర్భిణుల్లో ఎంతమందికి ఇక్కడే ప్రసవాలు జరిగాయి.. ఎంతమందిని ఇతర ఆసుపత్రులకు పంపారు.. అందుకు కారణాలేమిటన్నది రికార్డులతో పరిశీలిస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## పత్రికా స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదు

- దళిత జర్నలిస్టులపై వేధింపులు ఆపాలి: గద్దల రామకృష్ణ



**అశ్వాపురం, ఆగస్ట్ 11, ప్రజాజ్యోతి :** జర్నలిస్టులపై ఒత్తిళ్లు, బెదిరింపులు, కేసులతో వేధించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని దళిత సంఘం నాయకుడు గద్దల రామకృష్ణ అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల బాధ్యత అని, వారు తమ విధులను స్వేచ్ఛగా నిర్వహించే అవకాశం కల్పించాలని కోరారు. వార్తలపై అభ్యంతరాలు ఉంటే చట్టపరంగా వివరణ కోరాలే తప్ప జర్నలిస్టులను భయపెట్టేలా వ్యవహరించకూడదన్నారు. ముఖ్యంగా దళిత జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను తమ సంఘం సహించదని, ఇలాంటి ఘటనలు కొనసాగితే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఐక్యంగా స్పందిస్తామని హెచ్చరించారు. అధికారులు ఈ విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించి పత్రికా స్వేచ్ఛను, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని రామకృష్ణ కోరారు.

## యువ ఆపదమిత్ర శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోండి

- జిల్లా యువ అధికారి మేరా యువ భారత్
- మద్దుల వెంకట రాంబాబు

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 11 ,(ప్రజా జ్యోతి)** నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ , మేరా యువ భారత్ వారి ఆధ్వర్యంలో యువ ఆపదమిత్ర కార్యక్రమంలో భాగంగా సామాజిక స్పృహ కల్గిన యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లుగా మేరా యువ భారత్ ఖమ్మం జిల్లా యువ అధికారి మద్దుల వెంకట రాంబాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం వరదలు, కరువు, భూకంపాలు, కరోనా వంటి విపత్కర సమయంలో ఆపత్కాలంలో ఉన్నప్పుడు సహాయక చర్యలు చేపట్టడానికి భద్రతా దళాలకు అండగా ఉండటానికి యువతను సుశిక్షితులను చేసే అద్భుతమైన కార్యక్రమం అని అన్నారు, వారం రోజుల పాటు 6వ బెటాలియన్ టీజీఎస్పీ చాతకొండ, భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే ఈ శిక్షణ శిబిరం అన్ని ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని, ఆపత్కాలంలో ఉపయోగకరంగా ఉండే ఒక ఎమర్జెన్సీ కిట్ తో పాటు, శిక్షణ పొందినట్లు ప్రభుత్వ సర్టిఫికెట్ కూడా ఇస్తుందని తెలిపారు. దరఖాస్తు చేసుకోవాల్సిన వారి అర్హతలు ప్రభుత్వం జారీచేసిన అడ్రెస్ ప్రూఫ్ లో ఖమ్మం / భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన వారై ఉండాలి. వయస్సు 18 – 40 ఏళ్ల మధ్యలో ఉండాలన్నారు, విద్యార్హత కనీసం 7 వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలి. దరఖాస్తుకు ఈ నెల 25 చివరి తేదీ అని తెలిపారు, గ్రామాల్లోని యువత, విద్యార్థులు, యువజన సంఘాల సభ్యులు పెద్దఎత్తున నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పూర్తి వివరాల కోసం పాత బస్ స్టాండ్ సమీపంలోని మై భారత్ కార్యాలయంలో (నెహ్రూ యువకేంద్రం) సంప్రదించవచ్చు అన్నారు, కార్యాలయం మేరా యువ భారత్, ఖమ్మం సెల్ నెంబర్ 91773 29258 ను సంప్రదించాలని కోరారు.

## పాల్వంచ ట్రాన్స్కో డి ఈ గా బద్రు పవార్ నియామకం

- బాధ్యతలు చేపట్టిన బద్రుపవార్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 11 ,(ప్రజా జ్యోతి)** పాల్వంచ ట్రాన్స్కో డివిజనల్ ఇంజనీరుగా సీనియర్ అధికారి జె బద్రు పవార్ మంగళవారం పాల్వంచకు నియమితులయ్యారు, ఈ సందర్భంగా ఆయన బాధ్యతలు చేపట్టారు, గతంలో పనిచేసిన డి నందయ్య కొత్తగూడెం సర్కిల్ కార్యాలయంలో డివిజనల్ ఇంజనీర్ టెక్నికల్ గా బాధ్యతలు చేపట్టారు, ఖమ్మంలో డీఈ ఎంఆర్టీ గా పని చేస్తున్న బద్రు పవార్ బదిలీల భాగంగా పాల్వంచకు నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాలలో విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే త్వరితగతిన పరిష్కరిస్తానన్నారు, బద్రు పవార్ ఎన్పీడీసీఎల్ లో విధులు నిర్వహిస్తూ సీనియర్గా ఉంటూ పలువురు మన్ననలు పొందిన వ్యక్తిగా పేరు గావించారు

## కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను కార్యక ర్తలు ప్రజలకు ప్రచారం చేయాలి

- డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల



**కొత్తగూడెం కలెక్టరేట్ : పాల్వంచ /ఆగస్టు 11,(ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లో ప్రచారం చేయాలని డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాస రావు అన్నారు. పాల్వంచ మండల పరిధిలోని పలు పంచాయతీ గ్రామాలలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండలం పరిధిలోని చంద్రాల గూడెం, రేగులగూడెం, మల్లారం, లక్ష్మీదేవిపల్లి, ఉల్వనూరు, మందరికలపాడు,మొండికట్ట (సత్యనారాయణపురం), కారేగట్టు, ప్రభాత్ నగర్ (రెడ్డిగూడెం), యానంబైల్, కిన్నెరసాని గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీల నియామక కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలను చేపడుతుందని, కాంగ్రెస్ కార్యకర్తలు వాటిని ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. పేదల అభివృద్ధి కాంగ్రెస్ కే సాధ్యం అని కొత్వాల అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు గంగిరెడ్డి భువనసుందరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచులు వాసం రుద్ర, వజ్జ లలిత, కొర్స విజయ, మొక్కటి ధనలక్ష్మి, కుంజా సుధాకర్, కాంగ్రెస్ నాయకులు జాలె జానకిరెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, బరపటి వాసుదేవరావు, కొండం వెంకన్న గౌడ్ గౌడ్, బాలినేని నాగేశ్వరరావు, వాసం మంగయ్య, చౌగాని పాపారావు, బరపటి ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, వజ్జ నరేష్, తండా సూరయ్య, పడిగ కోటేశ్వరరావు, వర్సా నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## మాస శివరాత్రి వేళ శివపార్వతుల కల్యాణ మహోత్సవం

- ప్రదోషకాలంలో నందీశ్వర, పరమేశ్వర స్వామి వార్లకు ఏకకాలంలో విశేష అభిషేకాలు



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 11, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించిన అనంతరం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని రంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం ప్రదోషకాల సమయంలో నందీశ్వర స్వామివారికి, పరమేశ్వర స్వామివారికి ఏకకాలంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు ఓం నమశివాయ అంటూ స్వామివారిని స్మరించుకున్నారు. కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. మాస శివరాత్రి పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

- అధికారులేమో రూ.70 లక్షలు.. ప్రజాప్రతినిధులేమో కోటిన్నర!
- కన్సల్టెన్సీ మాత్రం రూ.2.50 కోట్లు అడుగుతోందన్న సమాచారం
- డీపీఆర్‌కు ముందే అదే సంస్థతో లైన్ ఎస్టిమేషన్.. రూ.7 లక్షలకు ఒప్పందం
- రూ.600 కోట్ల ప్రాజెక్టుపై 1.6 శాతం ఫీజు.. రూ.9.60 కోట్లకు పన్నులు అదనం
- మొత్తంగా డిపిఆర్ కే రూ.11.33 కోట్లు..
- అడ్వాన్స్ ఏ ఖాతా నుంచి చెల్లించాలన్న దానిపై అధికారుల్లో తర్జనభర్జన
- అన్ని వర్గాల నుంచి అభ్యంతరాలు.. అయినా ముందస్తు చెల్లింపులపై ఎందుకీ తొందర?




# ఇక.. అడ్వాన్స్ భాగోతం..!

**కొత్తగూడెం కార్పొరేషన్‌ను మరో భారీ రుణభారంలోకి నెట్టేలా ప్రతిపాదించిన రూ.600 కోట్ల ప్రాజెక్టుపై పట్టణంలో అన్ని వర్గాల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద మొత్తంలో ప్రజాధనం ఖర్చయ్యే అవకాశం ఉందని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, కుల సంఘాలు, సామాన్య ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నా.. కార్పొరేషన్‌లోని కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం కన్సల్టెన్సీ సంస్థకు ముందుగా ఎంత ఇవ్వాలి.. ఏ ఖాతా నుంచి చెల్లించాలి అన్న దానిపైనే దృష్టి పెట్టినట్లు సమాచారం. దీంతో అడ్వాన్స్ పేమెంట్ భాగోతం ఇప్పుడు కొత్త చర్చకు దారితీస్తోంది.**

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

**అడ్వాన్స్ ఇచ్చేందుకు కసరత్తులు..**

కొత్తగూడెం కార్పొరేషన్‌కు రూ.600 కోట్ల డీపీఆర్ బాధ్యతలు దక్కించుకున్న 'స్ట్రాటఅలైన్ అడ్వైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ 2023 అక్టోబర్‌లో ఏర్పడినదిగా కంపెనీ రికార్డుల్లో ఉంది. ఈ సంస్థకు ప్రాజెక్టు విలువపై 1.6 శాతం ఫీజు చెల్లించేలా వర్క్ ఆర్డర్ ఇచ్చారు. ఒకవేళ రూ.600 కోట్ల ప్రాజెక్టుకు తుది ఆమోదం లభిస్తే ఈ లెక్కన సుమారు రూ.9.60 కోట్లు కన్సల్టెన్సీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఇంత పెద్ద మొత్తంలో ఫీజు చెల్లించాల్సి ఉండగానే ముందుగానే అడ్వాన్స్ ఇచ్చేందుకు కూడా కార్పొరేషన్ వర్గాలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే ఈ ముందస్తు చెల్లింపుపైనే అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య తేడా ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు సుమారు రూ.70 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లిస్తే సరిపోతుందని భావిస్తుండగా.. కొందరు ప్రజాప్రతినిధులు మాత్రం రూ.1.50 కోట్లు ఇవ్వాలని సూచిస్తున్నట్లు సమాచారం. మరోవైపు సదరు కన్సల్టెన్సీ సంస్థ రూ.2.50 కోట్లు ముందుగానే చెల్లించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అసలు ఎంత చెల్లించాలి? దానికి ప్రాతిపదిక ఏమిటి? ప్రజాప్రతినిధులు ఎక్కువ మొత్తంలో చెల్లించాలని ఎందుకు పట్టుబడుతున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు ముందస్తుగా చెల్లించాల్సిన మొత్తాన్ని ఏ ఖాతా నుంచి విడుదల చేయాలన్నదాని పైనా కార్పొరేషన్‌లో తర్జనభర్జన జరుగుతున్నట్లు సమాచారం. గతంలో పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీలకు సంబంధించిన నిధులు వేర్వేరు ఖాతాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. వాటిని ఒకే ఖాతాలోకి మార్చాలని ఉన్నతాధికారుల నుంచి గతంలో ఆదేశాలు వచ్చినప్పటికీ అమలు కాలేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రస్తుతం వేర్వేరు ఖాతాల్లో ఉన్న నిధుల నుంచి కన్సల్టెన్సీకి అడ్వాన్స్ చెల్లింపును ఎలా చేయాలన్నది అధికారులకు సమస్యగా మారినట్లు సమాచారం.

**డీపీఆర్‌కు ముందే అదే సంస్థతో లైన్ ఎస్టిమేషన్?**

ఇన్ని కోట్ల భారీ ప్రాజెక్టుకు ముందుగా పనుల స్వరూపం, అంచనా వ్యయం తెలుసుకునేందుకు లైన్ ఎస్టిమేషన్ తయారు చేయడం సాధారణ ప్రక్రియ. అయితే ప్రస్తుతం డీపీఆర్ తయారు చేస్తున్న అదే కన్సల్టెన్సీ సంస్థతోనే ముందుగా లైన్ ఎస్టిమేషన్ కూడా చేయించినట్లు సమాచారం. ఇందుకోసం సుమారు రూ.7 లక్షలు చెల్లించే అంశంపై ముందుగానే చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి అధికారిక ఒప్పందం ఉందా? ఎవరి అనుమతితో పని అప్పగించారు? అన్నది స్పష్టంగా తెలియాల్సి ఉంది. ఇదే సంస్థకు తర్వాత డీపీఆర్ బాధ్యతలు కూడా అప్పగించడంతో లైన్ ఎస్టిమేషన్ నుంచి డీపీఆర్ వరకు పనులు వరుసగా అదే సంస్థకు ఎలా దక్కాయన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ముందుగానే ఉన్న పరిచయాల కారణంగానే ఈ పనులు అప్పగించారా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై కార్పొరేషన్ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

### పన్నులు అదనం.. మొత్తంగా రూ.11.33 కోట్లు..

అయితే డీపీఆర్ ఫీజు రూ.9.60 కోట్లకే పరిమితం కాదు. దీనికి పన్నులు కూడా అదనంగా చెల్లించాలి. రూ.600 కోట్ల ప్రతిపాదిత ప్రాజెక్టు విలువపై 1.6 శాతం కన్సల్టెన్సీ రుసుము లెక్కిస్తే రూ.9.60 కోట్లు వస్తుంది. అయితే ఈ మొత్తంలో పన్నులు కలిపి లేవని కన్సల్టెన్సీ సంస్థ తన లేఖలో స్పష్టంగా పేర్కొంది. అంటే రూ.9.60 కోట్ల రుసుముతో వ్యవహారం పూర్తికాదు. దానికి వర్తించే పన్నులను కార్పొరేషన్ అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ సేవకు 18 శాతం వస్తు సేవల పన్ను వర్తిస్తే మరో రూ.1.73 కోట్ల వరకు పన్ను భారం పడుతుంది. దీంతో రుసుము, పన్ను కలిపి మొత్తం చెల్లింపు సుమారు రూ.11.33 కోట్లకు చేరుతుంది. అంటే ఇప్పటివరకు రూ.9.60 కోట్లుగా కనిపిస్తున్న కన్సల్టెన్సీ వ్యయం వాస్తవ చెల్లింపు సమయంలో మరింత పెరగనుంది. ఈ అదనపు పన్ను మొత్తాన్ని కూడా కార్పొరేషన్ నిధుల నుంచే చెల్లించాల్సి ఉంటుంది. ప్రతిపాదిత రుణం నుంచే ఈ వ్యయాన్ని భరించాల్సి వస్తే, అప్పు భారంతో పాటు దానిపై పడే పన్ను భారం కూడా చివరికి కార్పొరేషన్ పైనే పడనుంది.

**అభ్యంతరాల మధ్యే ఎందుకీ తొందర?**

రూ.600 కోట్ల ప్రతిపాదిత రుణం అవసరమేంటన్న ప్రశ్నలతో పాటు.. డీపీఆర్ టెండర్ విధానం, ఒక్క సంస్థ ఎంపిక, 1.6 శాతం ఫీజు, లైన్ ఎస్టిమేషన్ నుంచి డీపీఆర్ వరకు ఒకే సంస్థకు పనులు రావడం వంటి అంశాలపై ఇప్పటికే పలు వర్గాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో కన్సల్టెన్సీకి ముందుగానే భారీ మొత్తాన్ని చెల్లించేందుకు ప్రయత్నించడం ఎందుకన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఒకవేళ ముందస్తు చెల్లింపు చేసిన తర్వాత డీపీఆర్ ప్రక్రియపై ఫిర్యాదులు, విచారణలు జరిగి టెండర్ లేదా ఒప్పందం రద్దయితే.. ఇప్పటికే చెల్లించిన డబ్బును తిరిగి ఎలా రాబడతారు? దానికి బాధ్యత ఎవరు వహిస్తారు? అన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజలు, ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ వర్గాలు మొత్తం వ్యవహారంపై స్పష్టత కోరుతున్న సమయంలో..ముందుగా కన్సల్టెన్సీకి ఎంత ఇవ్వాలన్న లెక్కల పైనే చర్చ సాగడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కార్పొరేషన్ అధికారులు మొత్తం వ్యవహారంపై బహిరంగంగా వివరణ ఇవ్వాలని, లైన్ ఎస్టిమేషన్ నుంచి డీపీఆర్ వరకు జరిగిన ప్రక్రియ, టెండర్, ఫీజు, నిధుల వివరాలను వెల్లడించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# చర్ల ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక



**చర్ల, ఆగస్టు 11:(ప్రజా జ్యోతి ):** సమాజంలో మత దురహంకారం, కుల వివక్షత, సాంఘిక అసమానతలు లేకుండా సమ సమాజ నిర్మాణం కోసం ఉద్యమిస్తామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి ములకలపల్లి రవి మాదిగ అన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చర్ల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక ఎమ్మార్పీఎస్ చర్ల మండల ఇన్చార్జి చెన్నం రామ్మూర్తి మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం రైతువేదికలో నిర్వహించారు.ఈ సందర్భంగా ములకలపల్లి రవి మాదిగ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ రాజీ లేని పోరాటాలు నిర్వహించి ఎస్సీ వర్గీకరణ సాధించడంతో పాటు మాదిగలతోపాటు పేద, అణగారిన వర్గాల సంక్షేమం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి బలమైన ప్రజా పోరాటాలను నిర్మించడంతోపాటు మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఏర్పాటు చేసి సంస్థను గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని అన్నారు. నూతన విద్యార్థి, యువతను ఉద్యమంలోకి తీసుకువచ్చి శక్తివంతమైన ఉద్యమ శక్తిగా తీర్చిదిద్దేందుకు ఎమ్మార్పీఎస్ శ్రేణులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఈసంపల్లి కృష్ణమాదిగ మాట్లాడుతూ దేశంలో కొనసాగుతున్న కుల వ్యవస్థ కారణంగా అణగారిన వర్గాలు వివక్షకు గురై పేదరికంలోనే మిగిలిపోయాయని అన్నారు. అణగారిన వర్గాల ఆర్థిక అభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకుంటూ గ్రామ స్థాయిలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి బలమైన ప్రజా పోరాటాలను నిర్మించాలని కోరారు. ఎమ్మార్పీఎస్‌తో పాటు అన్ని అనుబంధ విభాగాల కమిటీలు రద్దు అయిన నేపథ్యంలో నూతన మండల కమిటీలను ఏర్పాటు చేసి అన్ని అనుబంధ విభాగాలను సంస్థాగతంగా పునర్నిర్మించుకోవాలని అన్నారు. నూతన తరాన్ని ఉద్యమంలోకి తీసుకువచ్చి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాల సాధన, పీడిత వర్గాల విముక్తి కోసం మందకృష్ణ మాదిగ ఇచ్చిన ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.చర్ల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా పూసం ముత్యాలరావు మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధికార ప్రతినిధిగా వరికిల్ల సాయి మాదిగ, ప్రధాన కార్యదర్శిగా గుద్దేటి సాయి మాదిగ, కార్యదర్శిగా పూసం రాజా మాదిగతో పాటు కొప్పుల రాంబాబు మాదిగ, కూరపాటి వీర్రాజు మాదిగ, అలవాల చంద్రయ్య మాదిగ, గద్దల సత్యనారాయణ మాదిగ, పూసం శ్రీను మాదిగ, వేల్పుల సమ్మయ్య మాదిగ, పూసం రవి మాదిగ, రాంప్రసాద్, పూసం ప్రవీణ్, పింగిలి చంటి, పూసం రాంప్రసాద్, పూసం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాచారి సాహితీ సేవకు సన్మానం



**చర్ల, ఆగస్టు 11:(ప్రజా జ్యోతి):** ఉద్యోగ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూనే సాహిత్య రంగంలో తనదైన ముద్ర వేసిన ప్రముఖ కవి, రచయిత, అభ్యుదయ వాది తాతోలు దుర్గాచారి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం చర్లలోని స్థానిక గ్రంథాలయ ఆవరణలో తాతోలు దుర్గాచారి ఉద్యోగ విరమణ సందర్భంగా రూపొందించిన అభినందన సంచిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రముఖ సాహితీవేత్త చింతూరి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వర్తించిన దుర్గాచారి తన వృత్తి బాధ్యతలకు పరిమితం కాకుండా సాహిత్యంపై ఆసక్తితో కవితలు, వ్యాసాలు, వివిధ రచనలు చేస్తూ సమాజంలో చైతన్యం కలిగించే ప్రయత్నం చేశారని తెలిపారు. సామాజిక సమస్యలు, మానవ సంబంధాలు, సమాజంలోని వివిధ అంశాలను తన రచనల ద్వారా ప్రతిబింబించారని అన్నారు .ఉద్యోగ విరమణ సందర్భంగా సహచర ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉన్నతాధికారులు తెలిపిన అభినందనలు, శుభాకాంక్షలను ఒకే చోట పొందుపరిచి అభినందన సంచికగా రూపొందించడం అభినందనీయమని వక్తలు అన్నారు. దుర్గాచారి ఉద్యోగ జీవితంతో పాటు సాహిత్య ప్రయాణాన్ని కూడా గుర్తు చేసుకునేలా ఈ సంచిక ఉండటం ప్రత్యేకతగా పేర్కొన్నారు. సాహిత్యాభిమానులు, కళాకారులు, మిత్రులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరై దుర్గాచారికి శాలువాలు కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, శ్రీకాంత్ నీలి నందు, ఎస్.కే. షాజహాన్, పెద్దడ ఆశాలత, బత్తుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 25 ఏళ్ల తర్వాత.. ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు!

- **ఘనంగా రవి బాలనికేతన్ 1999–2000 బ్యాచ్ సిల్వర్ జూబ్లీ అలుమ్ని మీట్..**
- **గురువులకు ఘన సన్మానం.. పాత జ్ఞాపకాలతో సందడిగా కార్యక్రమం**




**కొత్తగూడెం, ఆగస్టు 11, ప్రజా జ్యోతి :** కొత్తగూడెంలోని రవి బాలనికేతన్ హైస్కూల్ 1999–2000 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ అలుమ్ని మీట్ ఆదివారం ఎస్‌ఎస్ కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. "మళ్లీ కలుద్దాం..జ్ఞాపకాలను నెమరు వేసుకుందాం.. ఆనందంగా గడుపుదాం" సందేశంతో జరిగిన ఈ కార్యక్రమానికి 70 మందికి పైగా పూర్వ విద్యార్థులు, 10 మందికి పైగా మాజీ ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. 25 ఏళ్ల తర్వాత వివిధ ప్రాంతాలు, నగరాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల రోజుల ఫొటోలు, తరగతి గది జ్ఞాపకాలు, ఆటలు, స్నేహితులతో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఇన్నేళ్ల తర్వాత కలుసుకున్నా తమ మధ్య స్నేహబంధం ఏమాత్రం తగ్గలేదని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాజరైన మాజీ ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. 25 ఏళ్ల తర్వాత తమ పాత విద్యార్థులను కుటుంబాలతో కలిసి ఒకే వేదికపై చూడటం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని ఉపాధ్యాయులు భావోద్వేగంతో తెలిపారు. తమను గుర్తు పెట్టుకుని ఇంత ఆత్మీయంగా ఆహ్వానించడం ఉపాధ్యాయ జీవితంలో గొప్ప గౌరవమని పేర్కొన్నారు. అలుమ్ని మీట్ నిర్వహించిన నిర్వాహకులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు గురు–శిష్య బంధాన్ని, పాత స్నేహాలను మరింత బలోపేతం చేస్తాయని అభినందించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ గణేష్ కుప్పాలతో పాటు నిర్వాహక బృందాన్ని అభినందించారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులతో నిర్వహించిన గ్రూప్ ఫొటో సెషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్నేహం, గురువుల పట్ల కృతజ్ఞత, బాల్య జ్ఞాపకాలతో సాగిన ఈ సిల్వర్ జూబ్లీ సమ్మేళనం అందరికీ చిరస్మరణీయంగా నిలిచింది.

## అశ్వాపురంలో రోడ్ల అభివృద్ధి పనులు అసంపూర్తిగా – ప్రజలకు ప్రమాద భయం



**అశ్వాపురం ఆగస్ట్ 11,ప్రజాజ్యోతి:** అశ్వాపురం పట్టణంలో ఇటీవల రోడ్లను వెడల్పు చేసి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేసినప్పటికీ, అవసరమైన సెంట్రల్ లైటింగ్ పనులు నెలలుగా పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో సరైన వెలుతురు లేకపోవడంతో డివైడర్లు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం పెరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి పనుల్లో భాగంగా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడం విమర్శలకు దారితీస్తోంది. రోడ్ల మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్లు వాహనదారులకు మార్గనిర్దేశం చేయాల్సినదిగా ఉండగా, వెలుతురు లేకపోవడంతో అవే ప్రమాదకరంగా మారుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ప్రత్యేకంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. ఇప్పటికే కొన్ని చిన్నపాటి ప్రమాదాలు జరిగినట్లు సమాచారం. వెంటనే సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేసి, రోడ్డు భద్రతను మెరుగుపరచాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. అభివృద్ధి పనులు కేవలం నిర్మాణాలకే పరిమితం కాకుండా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వేగంగా పూర్తి చేయాలని అశ్వాపురం వాసులు డిమాండ్ చేస్తున్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయంలో వైభవంగా రుద్ర హోమం



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 11 ,(ప్రజా జ్యోతి)** ఆ పాల్వంచ మండల పరిధిలోని కె.పి జగన్నాథపురం గ్రామంలో కొలువుతీరిన పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మంగళవారం వైభవంగా రుద్ర హోమం పూజా కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు, ముందుగా మేల తాళాలతో ,డప్పు వాయిద్యాలతో, వేదమంత్రాలతో స్వామివారి ఉత్సవమూర్తుల విగ్రహాలను అమ్మవారి ఆలయం నుండి యాగశాలకు ఊరేగింపుగా తీసుకొచ్చి మండపారాధన, గణపతి పూజ తదితర పూజలు నిర్వహించిన అనంతరం రుద్ర హోమం పూజ కార్యక్రమాన్ని నిర్వహించి పూర్ణాహుతి నిర్వహించారు, ఈ రుద్ర హోమం పూజా కార్యక్రమంలో ఇద్దరు దంపతులు పాల్గొనగా వారికి ఆశీర్వచనం అందించి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఏ విజయ్ కుమార్ తో పాటు ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు